## క్లుప్తంగా

### బేబీ ఫీడింగ్ కేంద్రం ఏర్పాటు




కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీడీపీవో నీలిమ, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తదితరులు

**డుంబ్రిగుడ:** మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో తల్లిపాలిచ్చే గదులను ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో నీలిమ మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రంలోని ఆయా కార్యాలయాలకు వచ్చే బాలింతలకు ప్రత్యేకంగా ఈ తల్లిపాలిచ్చే గదులను ప్రభుత్వం ఆదేశాలతో ఏర్పాటుచేశామన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### సచివాలయాల్లో తనిఖీలు



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

**గూడెంకొత్తవీధి:** గూడెంకొత్తవీధి మండలంలోని రింతాడ, లక్కవరపేట సచివాలయాలను ఎంపీడీవో ఉమామహేశ్వరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈవోపీర్డీ పాపారావు, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్షకు 282 మంది విద్యార్థులు హాజరు



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

**రాజవొమ్మంగి:** స్థానిక గిరిజన బాలికల గురుకుల కళాశాల కేంద్రంగా బుధవారం సెకండ్ ఇంటర్ ఇంగ్లీష్ పేపర్ -2 పరీక్ష జరిగింది. సెంటర్ కళాశాలతో పాటు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, టెన్ ప్లస్ స్కూల్‌లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఇక్కడ పరీక్ష రాస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్ సెకండ్ ఇయర్ ఇంగ్లిష్ పరీక్షకు మొత్తం 286 మంది హాజరు కావాల్సి ఉండగా, 282 మంది విద్యార్థులు మాత్రమే హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ సంతోషికుమారి తెలిపారు. నలుగురు గైర్హాజరైనట్టు తెలిపారు.

## విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



గంగవరంలో విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి భావన

**గంగవరం:** మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి భావన, కంటి వైద్యుడు ఏసుపాదం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశామన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గంగవరం పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలో 1,178 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, వీరిలో 87 మందికి కళ్లద్దాలు అవసరమైనట్టు గుర్తించి వారికి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం వై.లక్ష్మి, ఏఎన్ఎంలు చెల్లాయమ్మ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

## ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు



పరీక్ష అట్టలను చూపిస్తున్న విద్యార్థినులు, చిత్రంలో దాత డాక్టర్ సురేష్‌కుమార్ తదితరులు

**పెదబయలు:** విద్యార్థులు బాగా చదివి టెన్త్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, లక్ష్యంతో చదవాలని డాక్టర్ వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ తేడబారికి సురేష్‌కుమార్ అన్నారు. పెదబయలు కేజీబీవీ పాఠశాల, బొండాపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పదో తరగతి పరీక్షలపై ఒత్తిడికి గురికావద్దని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, ప్రణాళికతో చదవాలని సూచించారు. పదో తరగతిలో సాధించిన మార్కులు విద్యార్థుల భవిష్యత్‌కు పునాదిగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన తేడబారికి సురేష్‌కుమార్‌కు పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. హెచ్ఎం మోద అప్పారావు, ఉపాధ్యాయులు కె.వెంగళబాబు, జీవీపీ చంద్, కె.కొండబాబు, భీమరాజు, కొర్రా వెంకటేష్, చెండా భీమసుందర్, ఎస్.తిరుపతిరావు, పి.నారాయణరావు, నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

**పెదబయలు:** ఆశ, సీహెచ్‌డబ్ల్యూల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బొండా సన్నిబాబు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు బొండా గంగాధరం అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూల సమస్యల పరిష్కారం కోసం గురువారం నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆశ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని, ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. పలు డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి



రంపచోడవరం ఐటీడీఏ ఎదుట గిరిజనులు ధర్నా

**రంపచోడవరం:** అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని సంయుక్త కిసాన్ మోర్చ పిలుపులో భాగంగా ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకురాలు సర్పంచ్ వేట్ల విజయ, వంజం జోగారావు మాట్లాడుతూ గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు, పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. జీసీసీ గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారస్తులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ గిరిజనులను మోసం చేస్తున్నారన్నారు. జీడిమామిడి పప్పు మార్కెట్‌లో కిలో వెయ్యి ఉంటే ఇక్కడ సగం ధర కూడా పలకడం లేదన్నారు. జీడిపిక్కలు 80 కేజీలకు రూ.16 వేలు చెల్లించాలన్నారు. అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లుతో కూడిన వినతి పత్రాన్ని ఏఓ రమణకు అందజేశారు. ఉప సర్పంచ్ జోగన్నదొర, బుల్లబ్బాయి, రామిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన అవసరం



పాడేరులో గిరిజన మహిళలకు అవగాహన కల్పిస్తున్న మాలిని, తదితరులు



లక్కవరపేటలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



చింతూరులో మాట్లాడుతున్న సీడీపీవో విజయగౌరి

**పాడేరు రూరల్:** మహిళల అభివృద్ధే దేశానికి పునాది అని చైతన్య స్రవంతి సంస్థ డైరెక్టర్ మాలిని తెలిపారు. మండలంలో మినుములూరులో ఉన్న సంస్థ కార్యాలయంలో మహిళ చట్టాలు, హక్కులపై బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల హక్కులు, చట్టాలను సద్వినియోగం చేసుకొని, ఉన్నతులుగా ఎదగాలన్నారు.సమసమాజం మార్పులో మహిళల పాత్ర కీలకమన్నారు. ఎంఎస్ఎంఈ ప్రతినిధి అప్పికొండ శ్రీను మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం విశ్వకర్మ పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అందిస్తున్న చేతి వృత్తి శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆదర్శవంతులుగా నిలవాలన్నారు. అనంతరం ఎంఎస్ఎంఈ ద్వారా కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాలను అందజేశారు. పాడేరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ భానుశేఖర్, చైతన్య స్రవంతి సంస్థ ప్రతినిధులు రాజ్‌కుమార్, ఈశ్వర్, ఆనంద్ పాల్గొన్నారు.

**చింతపల్లి:** మహిళా శక్తిని చాటిచెప్పాలని గూడెంకొత్తవీధి ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీదేవి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ అధికారుల ఆదేశాల మేరకు వారోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని లక్కవరపేట అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో పలు అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ పర్యవేక్షకులు రామలక్ష్మి, మోహిని, వలసమ్మ, కృష్ణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

**చింతూరు:** బాల్య వివాహాల వల్ల అనర్థాలు చోటు చేసుకుంటాయని, వీటి నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చింతూరు సీడీపీవో విజయగౌరి అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలు, గంజాయి వల్ల అనర్థాలు, కెరీర్‌గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో విజయగౌరి మాట్లాడుతూ అబ్బాయిలకు 21 ఏళ్లు, అమ్మాయిలకు 18 ఏళ్లు నిండకుండా వివాహం చేయవద్దని, అలా చేయడం వలన విద్య, ఆరోగ్యం, ఆర్థిక, సామాజిక పరంగా నష్టం కలుగుతుందన్నారు. యువత చదువుకుని భవిష్యత్ సుగమం చేసుకోవాలని ఆమె సూచించారు. ఎంపీడీవో రామకృష్ణ, ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం పాల్గొన్నారు.

### వేగవంతంగా ఇంకుడు గుంతల నిర్మాణాలు

**చింతపల్లి:** ఉపాధి హామీ పథకం నిధులతో ఇంకుడు గుంతల నిర్మాణాలు వేగవంతం చేయాలని చింతపల్లి క్లస్టరు ఏపీడీవో సీతయ్య అన్నారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల ఉపాధి హామీ పథకం టీఏలు, సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ఇంకుడు గుంతల నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఏపీఓ రాజు, టీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

### మెరుగైన విద్య అందించాలి

**సీలేరు:** ధారకొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను బుధవారం జీకేవీధి తహసీల్దార్ రామకృష్ణ తనిఖీ చేశారు. ఏడవ తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు తెలుగు మాత్రమే చదవగలుగుతున్నారని, ఇంగ్లిష్ 30 శాతం మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నట్టు గుర్తించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు మెరుగైన విద్య అందించాలన్నారు. ఆర్ఐ మహదేవ్ తదితరులున్నారు.

### కంటి వైద్య శిబిరం రేపు

**సీలేరు :** ధారకొండలో శుక్రవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు సీఐ వరప్రసాద్ తెలిపారు. శిబిరంలో పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు అవసరమైతే వారిని ఉచితంగా ప్రత్యేక వాహనంలో విశాఖ తీసుకెళ్లి, ఆపరేషన్లు చేయించి తిరిగి స్వగ్రామాలకు పంపిస్తామన్నారు. ఈ నెల 10 న గూడెంకొత్తవీధిలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నిరంతర సాధనతోనే విజయం సాధ్యం



గిరిజన యువకుడు శ్రీనివాస్, తండ్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సీదరి మంగ్లన్నదొరను శాలువ కప్పి సన్మానిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, నాయకులు

- ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

**పాడేరు :** పేద కుటుంబంలో పుట్టి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం నిరంతరం సాధన చేసి విజయం సాధించిన గిరిజన యువకుడు సీదరి శ్రీనివాస్‌ను గిరిజన యువత ఆదర్శంగా తీసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలోని గబ్బంగి పంచాయతీ దేవరాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర కుమారుడు సీదరి శ్రీనివాస్ ఎస్ఐగా శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగంలో చేరాడు. దీంతో బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తండ్రి మంగ్లన్నదొర, కుమారుడు శ్రీనివాస్‌లను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఉద్యోగంలో బాగా రాణించాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, గబ్బాడ చిట్టిబాబు, గొల్లోరి నీలకంఠం, కుర్రబోయిన సన్నిబాబు, ఎంపీటీసీ సభ్యులు దూసురి సన్యాసిరావు, కె.నర్సింహహమూర్తి, లకే రామకృష్ణ పాత్రుడు, బిడిజన అప్పారావు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శరభ సూర్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు పాంగి నాగరాజు, మినుముల కన్నాపాత్రుడు, నాయకులు పాత్రుడు, నరేష్, రాజేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక దాడుల నిర్మూలన సామాజిక బాధ్యత

- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

**పాడేరు రూరల్:** పిల్లలపై లైంగిక దాడుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా చెప్పారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జాతీయ ఆరోగ్య మిషన్, రాష్ట్రీయ బాలల స్వస్థ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా తల్లి దండ్రులతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. గ్రామ స్థాయిలో వైద్య సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సైకాలజిస్ట్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చిన్న వయస్సులోనే పిల్లలు క్రమశిక్షణ అలవర్చుకునే విధంగా చూడాలన్నారు. ఏటీడబ్ల్యూవో రజినీ, వైద్య, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కొయ్యూరులో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో విజయకుమారి



అప్పలరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులకు అవగాహన కల్పిస్తున్న కుమారి

**కొయ్యూరు:** బరువు తక్కువ ఉన్న పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీడీపీవో విజయకుమారి కోరారు. ఆమె బుధవారం గిరిజన్ భవన్‌లో తల్లులు, అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. కొందరు పిల్లలకు బరువు తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయ చిన్నారుల ఆహార నియమాలను మార్చాలని సూచించారు. వర్కర్లు సైతం చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో సమావేశం ఏర్పాటు చేసి బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ప్రీప్రైమరీ విద్యపై ఇటీవల జరిగిన శిక్షణ కార్యక్రమాల్లో తెలుసుకున్న అంశాలను అమలుచేయాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన అంశాలపై ఆమె బాలికలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

**రాజవొమ్మంగి:** మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఈసీసీఈ డే ను నిర్వహించారు. పూర్వ బాల్యదశ సంరక్షణ, విద్య అనే అంశంపై పిల్లల తల్లులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలన్నారు. ఆట, పాటలతో చిన్నారులకు ప్రాథమిక విద్యను అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారులను ఆకర్షించేలా రకరకాల బొమ్మలు, వస్తువులతో అలంకరించారు.



రంపచోడవరంలో పిల్లలకు ఉపకరణాలు పంపిణీ

**రంపచోడవరం:** మానసిక దివ్యాంగ పిల్లల నడవడికలో మార్పు తీసుకురావాలని రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేశిరెడ్డి అన్నారు. ఏరియా ఆస్పత్రి ఆవరణలోని ట్రైబల్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్రీయ బాల స్వాస్థ్ కార్యక్రమంలో భాగంగా మానసిక దివ్యాంగ చిన్నారులకు ఉమా మనోవికాస కేంద్రం, కాకినాడ ద్వారా ఉపకరణాలు అందజేశారు.డాక్టర్ ఇందిరా, ఈఈసీ మేనేజర్ సతీష్‌బాబు, ఫిజియోథెరిఫిస్టులు డాక్టర్ జ్యోతి, రమాదేవి పాల్గొన్నారు.

### ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

**చింతూరు:** కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలం వెళ్లదీస్తోందని ఈ విషయంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. బుధవారం చింతూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు పూర్తవుతున్నా నేటి వరకు ఎన్నికల హామీలు అమలు చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వాన్ని విమర్శించడమే తప్ప హామీల అమలుకు కృషి చేయడం లేదని ఆయన విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తానని చెప్పి గ్రామసభల పేరుతో కాలం వెళ్లదీయడమే తప్ప నిర్వాసితుల సమస్యల పరిష్కారం దిశగా ఆలోచన చేయడంలేదన్నారు. ముంపు గ్రామాల్లో నిర్దిష్టంగా సర్వేచేసి తక్షణమే పరిహారం ఇవ్వడంతో పాటు పునరావాసం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ లోపాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 8 నుండి 17వ తేదీ వరకు నిర్వహించే ప్రజాచైతన్య యాత్రలను జయప్రదం చేయాలని కిరణ్ కోరారు. నాయకులు రాజులు, వెంకట్, సురేష్, సంతోష్, చిన్నబాబు, సీతారామయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన సంస్కృతిని కాపాడుకోవాలి

**రంపచోడవరం:** ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు తెగల అస్థిత్వానికి చిహ్నాలని , ఆచారాలు ,కట్టుబాట్లు కలిగి ఉన్నాయని జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి అధ్యక్షుడు కారం సీతారామన్నదొర(ఢిల్లీబాబు) అన్నారు. గిరిజన యువత మేల్కొని ఆచారాలు, సంప్రదాయాలు కాపాడుకోవాలన్నారు. లేనిపక్షంలో తెగల గుర్తింపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఆదివాసీ తెగల జీవన విధానం పర్యావరణంతో మమేకమై ఉంటుందన్నారు.

### నాయీ బ్రాహ్మణుల సదస్సు రేపు

**రంపచోడవరం:** మండల కేంద్రంలో ఈనెల 7న జిల్లా క్షౌరవృత్తిదారుల సదస్సు నిర్వహించనున్నారు. ఏజెన్సీలోని క్షౌరవృత్తిదారులు పాల్గొని విజయవంతం చేయాలని నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాంబాబు కోరారు. క్షౌరవృత్తిదారుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీని ఆవిష్కరించారు.

## 100 కిలోల గంజాయి పట్టివేత: ముగ్గురిపై కేసు నమోదు





జి.మాడుగుల, పెదబయలులో పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

**జి.మాడుగుల:** పాడేరు హైవేలో జీఎం కొత్తూరు జంక్షన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి మోత బరువుతో వెళ్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయడంతో గంజాయి పట్టుబడింది. ఎస్ఐ షణ్ముఖరావు బుధవారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. జీఎం కొత్తూరు జంక్షన్ వద్ద పోలీస్‌లు వాహనాలు తనిఖీ చేస్తుండగా వంజరి పంచాయతీ గొప్పులపాలెం గ్రామానికి చెందిన గొల్లూరి పొదలం అనే వ్యక్తి 30కిలోల గంజాయిని మోత బరువుతో అటువైపు తరలిస్తుండగా అనుమానం వచ్చి మూటను తనిఖీ చేయడంతో గంజాయి ఉన్నట్టు ఆయన చెప్పారు. పొదలం అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టు ముందు హాజరు పరచి రిమాండ్ తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. పట్టుబడిన గంజాయి రూ.1.50లక్షలు విలువ ఉంటుందని ఆయన తెలిపారు.

**పెదబయలు:** పెదబయలు మండలం అడుగులపుట్టు పంచాయతీ కొత్తాపుట్టు జంక్షన్‌లో బుధవారం వాహన తనిఖీలు చేస్తుండగా బొలేరో వాహనంపై తరలిస్తున్న 70 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్ఐ కె. రమణ తెలిపారు.బుధవారం ఉదయం కొత్తాపుట్టు జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తుండగా బొలేరో వాహనంలో ఇద్దరు వ్యక్తులు 70 కిలోల గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. ఒడిశా రాష్ట్రం మల్కర్‌గిరి జిల్లా నుంచి ముంచంగిపుట్టు మండలం భూషిపుట్టు మీదుగా రూడకోట మీదుగా పెదబయలు నుంచి ఒడిశా కోరాపుట్టు ప్రాంతానికి తరలిస్తున్న పెదబయలు మండలం జామిగుడ పంచాయతీకి చెందిన పాంగి రామ్‌చందర్, జీకే వీధి మండలం దారకొండ గ్రామానికి చెందిన కిలోల లలితను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. వాహనం సీజ్ చేసినట్టు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.3.5 లక్షలు ఉంటుందని, ఇద్దరి నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. వీఆర్వో కేశవకుమారి పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

**పాడేరు రూరల్:** విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఏఐఎస్ఎఫ్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తురకలవలస గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల వసతి గృహంలో ఇటీవల జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు చెలగాటమాడుతున్నారన్నారు. మన్యంలో జరుగుతున్న వరుస సంఘటనలతో సంబంధిత అధికారులు నామమాత్రంగా విచారణలతో కాలయాపన చేస్తున్నారన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో తక్షణం హెల్త్ వలంటీర్లు , వాచ్‌మెన్‌లు నియమించాలన్నారు. నాయకులు కృష్ణ, తనీష్, బాలు తదితరులు పాల్గొన్నారు.